# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-07-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం ఈరోజు సమావేశమైంది.**
2. **రాష్ట్రంలో త్వరలో ఆర్టీసీ ద్వారాఎలక్ట్రిక్ బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.**
3. **రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు ఆధార్ ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్లు గ్రామ,వార్డు సచివాలయాల శాఖ తెలిపింది.**
4. **ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు అధికారులు కృషి చేయాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు.**
5. **తిరుమలలో ఆర్జిత సేవలకు సంబంధించి అక్టోబరు నెల కోటా టికెట్ల విడుదల తేదీలను తిరుమల తిరుపతి దేవస్థానం ప్రకటించింది.**

==========================

రాష్ట్ర మంత్రివర్గం ఈ రోజు సమావేశమైంది. వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం కొనసాగుతోంది. ఈ సమావేశంలో ఓటాన్ అకౌంట్ సంబంధించిన ఆర్డినెన్స్‌కు అమోదం, ఎన్నికల హామీలు, వాటి అమలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మంత్రివర్గం చర్చిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మరోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ రోజు సాయంత్రం ఢిల్లీ వెళ్లనున్నారు. ఈ పర్యటనలో పలువురు కేంద్రమంత్రులను కలవనున్నారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

--------------------------

రాష్ట్రంలో త్వరలో ఆర్టీసీ ద్వారాఎలక్ట్రిక్ బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈరోజు ఆయన అమరావతిలో పాత్రికేయులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆర్టీసీ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని, సంస్థను బలోపేతం చేసేందుకు ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెండు వందల నూతన బస్సులను ఏర్పాటు చేశామన్నారు. వచ్చే మూడు నెలల్లో మరో రెండు వందల కొత్త బస్సులను ఆర్టీసీ ద్వారా నడపనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

--------------------------

రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు అన్ని జిల్లాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలను నిర్వహించాలని రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయాల డైరెక్టర్ ఎం.శివప్రసాద్ కలెక్టర్లను ఆదేశించారు. ఈ మేరకు ఆయన ఉత్తర్వులు జారీచేశారు. భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ –యూఏడీఏఐ నుంచి వచ్చిన సమాచారం మేరకు రాష్ట్రంలో 49 లక్షల 83 వేల 561 మంది ఆధార్ బయో మెట్రిక్, ఒక కోటి 36 లక్షల 17 వేల 47 మందికి సంబంధించి ధ్రువపత్రాల నవీకరణ అపరిష్కృతంగా ఉన్నట్లు తెలిపారు. వీటిని పూర్తి చేయడంతో పాటు, 5 ఏళ్లలోపు చిన్నారులను వందశాతం ఆధార్ నమోదు చేయడం కోసం ప్రత్యేక శిబిరాలకు అనుమతి ఇచ్చినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

---------------------------

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సమన్వయంతో అధికారులు పనిచేయాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి సూచించారు. నిన్న ఏలూరులో పర్యటించిన మంత్రి జిల్లా అధికారులతో సమావేశమైయ్యారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఏలూరు జిల్లాలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించామని తెలిపారు. జిల్లాలో ఆక్వారంగాన్ని మరింత అభివృద్ధి చేసేలా చర్యలు చేపడతామని మంత్రి తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. విశాఖపట్నం సాలగ్రామపురంలో నిర్వహించిన బీజేపీ ప్రజాప్రతినిధుల అభినందన సభలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తలంతా మిత్ర పక్షాలతో సమన్వయంతో పనిచేసి బీజేపీకీ గొప్ప విజయాన్ని అందించారన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ మాట్లాడుతూ బీజేపీ విభిన్న సంస్కృతులు గల పార్టీ అన్నారు. గత ప్రభుత్వ పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమైయ్యాయని విమర్శించారు. గతంలో కేంద్ర ప్రభుత్వ నిధులతోనే రాష్ట్రంలో పాలన సాగిందని తెలిపారు.

---------------------------

దేశంలో ఇప్పటివరకు ఐదు వందల 75 లక్షల హెక్టార్లలో ఖరీఫ్ పంటల సాగును చేపట్టినట్లు కేంద్ర రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ తెలిపింది. 62 లక్షల హెక్టార్లలో పప్పుధాన్యాల సాగు చేపట్టినట్లు తెలిపింది. కాగా, 140 లక్షల హెక్టార్లకు పైగా నూనెగింజల సాగును చేపట్టగా, గత ఏడాది 115 లక్షల హెక్టార్లలో నమోదైందని తెలిపింది. గత ఏడాది కాలంలో 95 లక్షల హెక్టార్లకు పైగా సాగైన వరి పంట విస్తీర్ణం ఇప్పుడు 115 లక్షల హెక్టార్లకు పెరిగిందని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

---------------------------

తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి ఆర్జిత సేవా, అంగప్రదక్షిణ తదితర సేవలకు సంబంధించి అక్టోబరు నెల కోటా టికెట్ల విడుదల తేదీలను తిరుమల తిరుపతి దేవస్థానం ప్రకటించింది. ఆర్జిత సేవా టికెట్లను ఈనెల 18వ తేదీన ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు తెలిపింది. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్లను ఈనెల 22వ తేదీన ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నామని పేర్కొంది. వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులు కలిగిన భక్తులు దర్శించుకునేందుకు వీలుగా ఇస్తోన్న ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్లను ఈనెల 23వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తామని

తెలిపింది. అలాగే అక్టోబర్ నెలకు సంబంధించి ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను ఈనెల 24 ఉదయం 10 గంటలకు, గదుల కోటాను అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేయనున్నట్లు టిటిడి ఒక ప్రకటనలో తెలిపింది.

---------------------------

చిత్తూరులో సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు ఏర్పాటు చేయనున్నట్లు  చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు. చిత్తూరులో ఈరోజు పలువురు యువ పారిశ్రామికవేత్తలతో ఎంపీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ పాత్రికేయులతో మాట్లాడుతూ, సూక్ష్మ, మధ్యతర పరిశ్రమలను ఏర్పాటు చేయడమే కాకుండా అనేక మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. పరిశ్రమల ఏర్పాటు కోసం స్థల సేకరణ చేస్తున్నామని, త్వరలోనే ఆ ప్రక్రియ పూర్తవుతుందన్నారు.  కేంద్ర ప్రభుత్వ సహకారంతో మరిన్ని పరిశ్రమలు కూడా నెలకొల్పేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

---------------------------

గత ప్రభుత్వం రద్దు చేసిన 18 గిరిజన పథకాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వాటిని పునరుద్ధరించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. సచివాలయంలో గిరిజన సంఘాల నేతలతో మంత్రి నిన్న సమావేశమయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనులు ఎదుర్కొంటున్న  ప్రధాన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్యా, వైద్యమే కాకుండా అన్ని రంగాల్లో గిరిజన ప్రగతికి ప్రాధాన్యమిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఎన్టీఆర్ జిల్లాలో ఈ ఏడాది వర్షాకాలంలో నీటి సంరక్షణ, నీటి పారుదల సామర్థ్యం పెంపునకు 60.58 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ జి.సృజన తెలిపారు. విజయవాడలో జలశక్తి అభియాన్ కింద చేపట్టిన పనుల ప్రగతిపై కలెక్టర్ సమీక్షించారు. అనంతరం జలశక్తి అవగాహన ప్రచార పత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,  నీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో ఆక్ర మణలు తొలగించాలని, ప్రతి వర్షపు నీటి బొట్టును భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఏడాది జలశక్తి అభియాన్ కింద అమృత సరోవర్ ద్వారా సాగు నీటి చెరువుల అభివృద్ధి,  సన్న కారు రైతుల పొలాల్లో పంట కాల్వల తవ్వకం, చెరువుల పునరుద్ధరణ పనులు, కాల్వల పూడికతీత వంటి పనులు చేపట్టినట్లు వివరించారు. వీటిలో కొన్ని పూర్తవగా, మిగతావి పురోగతిలో ఉన్నట్టు కలెక్టర్ వెల్లడించారు.

---------------------------

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆణివార ఆస్థాన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈరోజు ఉదయం బంగారు వాకిలి ముందు గల ఘంటామండపంలో సర్వభూపాల వాహనంలో ఉభయదేవేరులతో కూడిన శ్రీ మలయప్పస్వామివారు గరుత్మంతునికి అభిముఖంగా వేంచేపు చేశారు. మరో పీఠంపై స్వామివారి సర్వసైన్యాధ్యక్షుడైన శ్రీవిష్వక్సేనులవారు దక్షిణాభిముఖంగా వేంచేపు చేశారు. ఈ ఉత్సవమూర్తులతో పాటు ఆనందనిలయంలోని మూలవిరాట్టుకు ప్రత్యేకపూజలు, ప్రసాదాలు నివేదించారు. అనంతరం గత ఏడాది ఆదాయ, వ్యయాలను అధికారులు స్వామివారికి విన్నవించారు. ఈరోజు సాయంత్రం పుష్పపల్లకిలో స్వామి అమ్మవార్లు భక్తులకు దర్శనమివ్వనున్నారు. కాగా ఆణివార ఆస్థానం సందర్భంగా విఐపీ విరామ దర్శనాలు, పలు ఆర్జిత సేవలను టిటిడి రద్దు చేసింది.

---------------------------

శిరస్త్రాణం హెల్మెట్ ను వినియోగించడం ద్వారా రహదారి ప్రమాదాల నుంచి రక్షణ పొందవచ్చని జిల్లా న్యాయమూర్తి ఏ.భారతి తెలిపారు. శిరస్త్రాణం వినియోగంపై ఒంగోలులో జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహనా ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి మాట్లాడుతూ, శిరస్త్రాణం వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ద్విచక్ర వాహనాలను నడిపేవారు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని సూచించారు.

---------------------------

శ్రీ సత్యసాయి జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఈ నెల 30 వ తేదిలోపు వంద శాతం పన్ను వసూళ్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ టీఎస్. చేతన్ అధికారులను ఆదేశించారు. గత సాయంత్రం పుట్టపర్తిలో పన్ను వసూలుపై సంబంధిత అధికారులతో కలెక్టర్ దృశ్యమాధ్యమం ద్వారా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పన్నుల వసూళ్లలో జిల్లా 64శాతం వృద్ధి నమోదు చేసిందని తెలిపారు. పంచాయితీ కార్యదర్శులు ఇంటి పన్ను వసూలు ప్రక్రియను పూర్తి చేయడానికి కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు

--------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 112వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 26వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

======================